క్లుప్తంగా

డెంగీతో జాగ్రత్త



జనగామ: వర్షాకాలం నేపథ్యంలో డెంగీ తదితర వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏడీపీహెచ్ఓ మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డు సంజయ్‌నగర్‌లో 7వ తరగతి చదువుతున్న అమ్రిన్ డెంగీతో బాధపడుతుండగా శనివారం అతని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమయానికి మందులు వేసుకుంటూ పండ్లు, బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రభాకర్, రమేష్, సాయితేజ, ఏఎన్ఎంలు ఉన్నారు.

నియామకం



మహిపాల్

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్‌కు చెందిన శానబోయిన మహిపాల్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు చేవేళ్ల మహేందర్ నిమామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతను తెలిపారు.

బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా మహేష్‌యాదవ్

రఘునాథపల్లి: మండలంలోని రామరాయని బంగ్లా గ్రామానికి చెందిన తోట మహేష్‌యాదవ్ బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ శనివారం మహేష్‌యాదవ్‌కు నియామకపు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేస్తూ, రైతాంగం సమస్యలపై పోరాడుతానని పేర్కొన్నారు. తన నియమానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని పడమర కొండపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు శనివారం అధిక సంఖ్యలో భక్తులు రావడంతో సందడి నెలకొంది. శ్రావణమాసంలో ప్రతీ ఏటా స్వామివారి మహోత్సవాలు జరుగుతాయి. అందులో భాగంగా శ్రావణ శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండ దిగువన ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కులు సమర్పించారు. కాగా, దర్శనానికి వచ్చిన భక్తులకు అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఓటరు లిస్టులో సవరణలు చేపట్టాలి



బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటరు లిస్టులో సవరణ చేపట్టాలని నాయబ్ తహసీల్దార్ ఫణికిషోర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటరు లిస్టులో తప్పొప్పులను సరిచూసి త్వరగా సర్వేను పూర్తిచేయాలన్నారు. ఆయా గ్రామాల బీఎల్ఓలు, పలువురు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

దేవరుప్పుల: ప్రతీ దుకాణంలో, షాపులకు ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ఎస్సై సృజన్‌కుమార్ సూచించారు. శనివారం దేవరుప్పుల మండలకేంద్రంలోని రహదారి చౌరస్తా ప్రాంగణంలో ఉన్న వ్యాపార సంస్థల నిర్వాహకుల వద్దకు వెళ్లి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు. ఈ సందర్భంగా దుకాణాల తోపాటు ఫార్మాసిస్ట్ గుండు జ్యోతి, గ్రామీణవైద్యుడు గుండు సుధాకర్‌లకు నోటీసులు అందించారు. ఎస్సై వెంట సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత



బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దామెర వెంకటలక్ష్మి, ఐలయ్య దంపతుల కూతురు బన్విక వివాహానికి మాజీ సర్పంచ్ మల్లవరం దివ్య, మున్సిపల్ కౌన్సిలర్ మల్లవరం అరవింద్‌రెడ్డి పుస్తెమెట్టెలను శనివారం అందజేశారు. కృష్ణ, రాజమౌళి, మధు, బాపిరాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

జనగామ: ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో వేడుకల్లో విద్యార్థులతో కరస్పాండెంట్ ఉపేందర్‌రెడ్డి



జనగామ: సరస్వతీ శిశుమందిర్‌లో..



జనగామ రూరల్: సెయింట్ మేరీస్‌లో..



జనగామ రూరల్: శ్రీఅరబిందో పాఠశాలలో..



ఈనెల 26న శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ వేయడంతో పాటు పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థినులు



చిల్పూరు: కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



నర్మెట: హన్మంతాపూర్ పాఠశాలలో..



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ మేథాస్ స్కూల్‌లో..



బచ్చన్నపేట: తుమ్మబాల పాఠశాలలో..



దేవరుప్పల: శ్రీసాయిప్రశాంతి విద్యాలయంలో..



పాలకుర్తి టౌన్: ప్రగతి విద్యాలయంలో..

అండర్ బ్రిడ్జి రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న సీఐ వేణు

సాక్షి ఎఫెక్ట్..

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉన్న తీరుపై సాక్షి దినపత్రికలో శనివారం 'ప్రయాణం..ప్రమాదకరం' శీర్షికన వచ్చిన కథనానికి ఘన్‌పూర్ సీఐ వేణు స్పందించారు. రోడ్డుకు మరమ్మతు పనులు సీఐ దగ్గరుండి చేయించారు. గుంతలపై సిమెంట్ డస్ట్, క్రషర్ చిప్స్ పోయించి గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు గుంతలను పూడ్చివేయించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో అండర్ బ్రిడ్జి వద్ద లైట్లను ఏర్పాటు చేయిస్తామని, అందరూ ట్రాఫిక్ నిబంధనల్ని పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారణకు సహకరించాలని కోరారు. కాగా, రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గుంతలరోడ్డు సమస్యపై కథనం ప్రచురించిన సాక్షికి, స్పందించి పనులు చేయించిన సీఐకి ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు అప్రోచ్ రోడ్డుకు హద్దుల ఏర్పాటు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐ

లింగాలఘణపురం: మండలంలోని క్లాం-ఏనెబావి మధ్యలో ఉన్న టెక్స్‌టైల్ పార్క్‌కు వెళ్లేందుకు శనివారం ఎట్టకేలకు అప్రోచ్ రోడ్డుకు హద్దులు ఏర్పాటు చేశారు. మాణిక్యాపురం గ్రామంలో నుంచి కాకుండా గ్రామం చివరిలో నుంచి 700 మీటర్ల అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలోనే భూసేకరణ చేపట్టారు. 700 మీటర్ల దూరం వేసే రోడ్డులో 3.23 ఎకరాల భూమి 11 మంది రైతులు నష్టపోతున్నారు. అందుకు భూసేకరణలో ఎకరానికి రూ.14 లక్షల చొప్పున ఖరారు చేశారు. తమకు నష్టపరిహారం ఎక్కువ ఇవ్వాలని, భూమికి బదులు మరో చోట భూమి ఇవ్వాలని రోడ్డు పనులను అడ్డుకున్నారు. పరిహారం తీసుకోకుండా కోర్టుకు వెళ్లారు. శనివారం తహసీల్దార్ వినయలత, టీఎస్ఐఐసీ డీఈ శ్మరత్‌చంద్ర, సీఐ శ్రీనివాసురెడ్డిలతో పాటు మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి రైతులతో చర్చించారు. టెక్స్‌టైల్ పార్క్‌లో ఎక్కడైన ప్రభుత్వ భూమి ఉంటే నష్టపోయిన రైతులకు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయగా న్యాయం జరిగే విధంగా చూస్తామని అధికారులు నచ్చజెప్పి హద్దులు మాత్రం ఏర్పాటు చేశారు. ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఈ ఆలోజీ, ఆర్ఐ కిశోర్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



మురుగునీరు పోయేదెలా?

మండల కేంద్రంలోని 6వ వార్డులో సీసీ రోడ్డు పక్కన ఉన్న మోరీ నిండా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మురుగునీరు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో చిన్నపాటి వాన కురిసినా వర్షపు నీటితో పాటు మురుగు రోడ్డుపైకి వస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నాయి. జీపీ అధికారులు పన్నుల వసూలుపై దృష్టి సారిస్తున్నారే తప్ప పారిశుద్ధ్య సమస్యను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

- బచ్చన్నపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
అనిల్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 99633 06256

విద్యార్థులకు క్రమశిక్షణ కీలకం



ఎన్‌సీసీ విద్యార్థులు కల్నల్ సెంథిల్ రామదురై, హెచ్ఎం, ఎన్‌సీసీ అధికారి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో కీలకమని, క్రమశిక్షణ లేని చదువు వ్యర్థమని ఎన్‌సీసీ తెలంగాణ పదో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సెంథిల్ రామదురై అన్నారు. మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ ఆయన శనివారం సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లాలో రెండు ఎన్‌సీసీ యూనిట్లు ఉన్నాయని, అందులో ఛాగల్లు యూనిట్ ఎన్‌సీసీ కేడెట్స్ ఉత్తమ ప్రతిభ చూపుతున్నారన్నారు. ప్రతీ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తూ రాణిస్తున్నారని, అందుకు ఉపాధ్యాయుల సహకారం అభినందనీయమన్నారు. పాఠశాలలో ఎన్‌సీసీ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న హెచ్ఎం కొమురయ్యను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్‌సీసీ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని, ఎన్‌సీసీలో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ గోల్స్ ఏర్పాటు చేసుకుని లక్ష్యసాధనకు ప్రణాళికయుతంగా కృషి చేయాలన్నారు. ఎన్‌సీసీ కేడెట్లు చిత్తశుద్ధితో శిక్షణ పొందాలని, ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే, స్వాతంత్ర్యదినోత్సవం పరేడ్‌లో పాల్గొనేలా కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం కల్నల్‌ను ఘనంగా సన్మానించారు. ఎన్‌సీసీ మాజీ అధికారి, గణిత ఉపాధ్యాయుడు కొల్లూరు ప్రకాశం, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరి, శ్రీనివాస్, రంజిత్‌కుమార్, విజయకుమారి, వెంకటేష్, లలితకుమారి, దేవేందర్‌కౌర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినోదాన్ని పంచుతున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో సందడి చేస్తున్న పెద్దలు, చిన్నారులు



జనగామ: పట్టణంలోని ప్రెస్టన్ మైదానంలో ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ జిల్లా ప్రజలకు వినోదాన్ని అందిస్తోంది. ప్రతి రోజూ సాయంత్రం ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్‌కు కుటుంబ సమేతంగా వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఎగ్జిబిషన్‌లో ధరలను నిర్ణయించారు. వాటర్ నైడింగ్, షూటింగ్, రాట్నం, జాయింట్ వీల్, కొలంబస్, కిడ్స్ స్లైడర్, డ్రాగన్ ట్రెయిన్, డెవిల్ హౌజ్, రొటేటింగ్ కప్స్ ఇలా అనేక రకాల వినోదాన్ని పంచే వాటిని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. పట్టణంతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి చిన్నా, పెద్దా వస్తున్నారు. పట్టణ, జిల్లా ప్రజలు ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.


మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం సారయ్య

రఘునాథపల్లి: మహిళల అర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుందని ఏపీఎం సారయ్య అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ రైతు వేదికలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం ఖిలాషాపూర్, అశ్వరావుపల్లి క్లస్టర్ల పాడి పశువులు, పెరటికోళ్ల పెంపకంపై మహిళలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి అశోక్ మహిళలకు పాడి గేదెల ఎంపిక, పోషణ, నిర్వహణపై మహిళలకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో సీసీలు ఉమాదేవి, సరోజన గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు కోమలత, నిర్మల, వీఓఏలు పద్మ, సరిత, సుజాత, సోమయ్య, వీరన్న, ఉపేంద్ర, మహిళా రైతులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పాల్గొనాలి



మాట్లాడుతున్న ప్రత్యూష

చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామంలోని విష్ణుదుర్గామాత ఆలయంలో నేడు (ఆదివారం) మొక్కులు సమర్పించుకునేందుకు రానున్న మంత్రి కొండా సురేఖ దంపతులకు రాజకీయాలకు అతీతంగా పాల్గొని ఘనస్వాగతం పలకాలని మాజీ సర్పంచ్, ఆలయ చైర్మన్ కేశిరెడ్డి ప్రత్యూషామనోజ్‌రెడ్డి కోరారు. గ్రామంలో శనివారం విలేకరులతో ప్రత్యూష మాట్లాడారు. ఉదయం 10 గంటలకు కొండా దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రూ. 8 లక్షల విలువైన బంగారు హారం, ముక్కుపుడక, పుస్తెలు, కమ్మలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటారని తెలిపారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కొండా అభిమానులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రంగు హరీశ్, ఉడుత వెంకన్న, గొంగిడి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిసారించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జనగామ రూరల్: నేటి పోటీ ప్రపంచంలో చదువుతోపాటు విద్యార్థులు కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్‌పై దృష్టిసారించాలని హైదరాబాద్ ఎన్జీటస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనూష భరద్వాజ్ అన్నారు. మండలంలోని పెంబర్తి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో నిర్వహించిన వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే లైఫ్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. ప్రిన్సిపాల్ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి

జనగామ రూరల్: సెప్టెంబర్ 9న జనగామ పట్టణంలో నిర్వహించే వీర తెలంగాణ రైతాంగ పోరాట యోధుల యాదిలో శౌర్య యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. గోపి, అజారుద్దీన్, కళ్యాణి, శ్రావన్, వరలక్ష్మి, మల్లేష్, సిద్ధిరాములు తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి వారకల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధి లో శ్రావణ మాసం మూడో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా వార కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో రాంపూర్‌కు చెందిన ముత్యం నాగభూషణం-స్వరూప, చెన్నూరి రవీందర్-మాలిని దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. పొట్లపల్లి శ్రీధర్‌రావు, కిరణ్మయి పాల్గొన్నారు.

ప్రీతమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల: తెలంగాణ షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతమ్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, ప్రదీప్, రమేష్, నల్ల రాజు, నల్ల అనిల్, మాచర్ల ప్రవీణ్, వెంకన్న ఉన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

బచ్చన్నపేట: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బసిరెడ్డిపల్లి జీపీ కార్యదర్శి ఎన్. చారి అన్నారు. శనివారం గ్రామంలో పర్యటించి పలు వీధుల్లో జీపీ సిబ్బందితో పిచ్చి మొక్కలను తీసివేయించారు.

పాఠశాలకు టేబుళ్ల విరాళం

నర్మెట: మండలంలోని అమ్మాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి బైరగోని రాజు మూడు టేబుళ్లను విరాళంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు తనవంతు సాయంగా టేబుళ్లను అందజేసినట్లు తెలిపారు. కాగా రాజును గ్రామస్తులు అభినందించారు. హెచ్ఎం పాతూరు ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తండాలను బమ్మెర జీపీలో విలీనం చేయాలి

పాలకుర్తి: పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లి పరిధిలోని తండాలను కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని, లేని పక్షంలో బమ్మెర జీపీలో విలీనం చేయాలని తండాల వాసులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. బానోత్ రమేశ్, శంకర్, నూనావత్ చిరంజీవి, నూనావత్ రమేష్, సునీల్, రజనికాంత్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



ఇరుగు స్వాతి

నర్మెట : మండలంలోని హన్మంతాపూర్ గ్రామానికి చెందిన ఇరుగు స్వాతి అదృశ్యమైనట్లు ఎస్సై నగేష్ తెలిపాడు. 2018 సంవత్సరంలో ఇరుగు నరేష్-స్వాతికి వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ కాశీయాత్రకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే అతడి భార్య స్వాతి ఇంట్లో కనిపించలేదు. దీంతో తెలిసిన బంధువుల వద్ద వెతికిన ఆమె ఆచూకీ లభించలేదన్నారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న ఎస్వీ గార్డెన్‌లో పెళ్లి జరుగుతుండగా టీవీఎస్ మోపెడ్‌ను దొంగిలించిన వ్యక్తిని పట్టుకున్నామని అన్నారు. మండల కేంద్రంలో పెట్రోలింగ్ చేస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తున్న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన షేక్ ఖయ్యూమ్‌ను ఆపగా వాహనాన్ని కిందపడేసి పరిగెత్తేందుకు ప్రయత్నించగా పట్టుకుని విచారించామన్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి అతడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

నిరుపయోగంగా గ్రంథాలయ భవనం



చిల్పూరు: ప్రతి ఒక్కరికి విజ్ఞానాన్ని అందజేయాలనే ఉద్దేశంతో రాజవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట గ్రామానికి చెందిన మారేపల్లి రంగారెడ్డి దంపతులు తల్లి కమలాదేవి స్మారక గ్రంథాలయ భవనాన్ని 2017లో నిర్మించి గ్రామస్తులకు అప్పగించారు. అప్పటి నుంచి నాలుగేళ్లపాటు దాతల సహకారంతో కొనసాగింది. ఆ తర్వాత ఒక్కో దాత తప్పుకోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా స్పందించి నెలకు ఒకరు చొప్పున అందులో పుస్తకాలు, దినపత్రికలు వేయించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని విద్యావేత్తలు, విద్యార్థులు కోరుతున్నారు.